నవతెలంగాణ
నవ్యత తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | సెప్టెంబర్ 16, 2023 | www.navatelangana.com

కలెక్టరేట్ ముట్టడి వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

రామకృష్ణాపూర్ : మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల కలెక్టరేట్ ముట్టడి వాల్ పోస్టర్లను శుక్రవారం క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సుధామల్ల హరికృష్ణ, పారిపెల్లి తిరుపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 20న పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని,కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని విధి నిర్వాహణలో 5లక్షల బీమా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నవీన్, బానోత్ శంకర్, గడ్డం రమేష్, ఇర్లకుమార్,దరావత్ క్రాంతి, కొయ్యడ వెంకటి,రాజశేఖర్, విష్ణు, నాగరాజు,కార్మికులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ ర్యాలీలో మాజీ జెడ్పీటీసీ మృతి

- రెబ్బెన మండలంలో విషాదం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రెబ్బెన మండల మాజీ జడ్పిటిసి కార్నాథం చంద్రయ్య(60) మెడికల్ కళాశాల ప్రారంభోత్సవంలో భాగంగా జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్ని ఒక్కసారిగా అంబేద్కర్ చౌక్ వద్దకు రాగానే కుప్పకూలారు. వెంటనే కార్యకర్తలు, నాయకులు గమనించి ఆసుపత్రికి తీసుకువెళ్లే క్రమంలో గుండెపోటుతో అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. జెడ్పిటిసికి ముగ్గురు కూతుళ్లు ఉండగా ఆయన స్వగ్రామమైన రెబ్బెన మండలం ఎడవెల్లిలో విషాదం అలుముకుంది. మాజీ జెడ్పిటిసి మరణం పట్ల పార్టీ మండల నాయకులతో పాటు, జిల్లా నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు.



టికెట్ ఎవరికి దక్కేను..?

- కాంగ్రెస్ జాబితాపై సర్వత్రా ఉత్కంఠ
- అధిష్టానం పెద్దల చుట్టూ ఆశావహుల చక్కర్లు
- ఇప్పటికే ప్రజల్లోకి వెళ్లి ముమ్మర ప్రచారం
- ఎవరికి వస్తుందోనని శ్రేణుల్లోనూ అయోమయం

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థుల జాబితాపై తీవ్ర ఉత్కంఠ రేకెత్తిస్తోంది. ఇప్పటికే అసెంబ్లీ బరిలో ఉండే అధికార పార్టీ అభ్యర్థులెవరో తేలిపోవడంతో ఇక ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ టికెట్లపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ ఈ చర్చ మరింత జోరుగా సాగుతోంది. ఉమ్మడి జిల్లాలోని పది స్థానాల్లో ఒకటి, రెండుచోట్ల మాత్రమే టికెట్ల కోసం అంతగా పోటీలేకపోగా.. మిగిలిన అన్ని స్థానాల్లో ఆశావహుల మధ్య తీవ్ర పోటీ కనిపిస్తోంది. ఇప్పటికే ఎవరికి వారు జనాల్లోకి వెళ్లి తనకే టికెట్ వస్తుందని ముమ్మరం ప్రచారం చేసుకుంటున్నారు. మరికొందరు ఆశావహులు టికెట్ వస్తుందనే అతి ధీమాతో తాయిలాలు కూడా పంపిణీ చేస్తుండటం చర్చనీయాంశంగా మారుతోంది. ఇలా ఒక్కో నియోజకవర్గంలో పలువురు ఆశావహులు టికెట్ కోసం ఎదురుచూస్తుండటంతో ఆ పార్టీ శ్రేణుల్లోనూ అయోమయం నెలకొంది. ఈ నెల 22వ తేదీ తర్వాతే టికెట్ల కేటాయింపు ఉంటుందనే ఆ పార్టీ శ్రేణుల వినిపిస్తోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ టికెట్లపై ఉత్కంఠ తారాస్థాయికి చేరింది. అధికార పార్టీ అభ్యర్థుల జాబితా వెల్లడికావడంతో కాంగ్రెస్ అభ్యర్థులెవరనేదానిపై అందరి దృష్టి కేంద్రీకృతమవుతోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 17న హైదరాబాదు తుక్కుగూడలో విజయభేరి సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ సమావేశంతో పాటు ఈ నెల 22 వరకు పార్లమెంటు సమావేశాలు ఉండటంతో వాటి తర్వాతే టికెట్ల కేటాయింపు ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. మరోపక్క గతంలో కాకుండా ఈ సారి టికెట్లను ముందుగానే ప్రకటించాలనే ఆలోచనలో ఆ పార్టీ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించిన ఏఐసీసీ వాటిని స్క్రూటినీ చేసి అభ్యర్థుల బలాబలాలను అంచనా వేస్తోందని తెలుస్తోంది. మరోపక్క ఇప్పటికే పలువురు ఆశావహులు ఈ సారి ఎలాగైనా టికెట్ దక్కించుకోవాలనే ఉద్దేశంతో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వారికి పరిచయం కలిగిన అధిష్టానం పెద్దలను కలుస్తూ టికెట్ తనకే వచ్చేలా చూడాలని కోరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ రాష్ట్ర నాయకత్వంతో పాటు దిల్లీ పెద్దలను కూడా కలుస్తూ తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించారు.

ఒక్కో స్థానంలో పలువురు పోటీ..!

ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ స్థానాల కోసం టికెట్ కోసం ఏకంగా 54మంది ఆశావహులు దరఖాస్తులు చేయడం గమనార్హం. ఒకటి, రెండు నియోజకవర్గాల్లో మినహా ఎక్కువ చోట్ల ముగ్గురి కంటే ఎక్కువ మంది టికెట్ ఆశిస్తున్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 8మంది ఆశావహులు టికెట్ కోసం దరఖాస్తులు చేసుకోగా.. బోథ్ నియోజకవర్గంలో ఏకంగా 11మంది టికెట్ ఆశిస్తూ దరఖాస్తులు చేసుకున్నారు. బెల్లంపల్లి, చెన్నూర్, ఖానాపూర్ నుంచి ఆరుగురి చొప్పున, సిర్పూర్, నిర్మల్, ముథోల్‌లో ముగ్గురేసి దరఖాస్తులు అందించారు. ఆసిఫాబాద్ నుంచి నలుగురు టికెట్ ఆశిస్తున్నారు. మంచిర్యాలలో మాత్రం ఇద్దరు మాత్రమే అందించారు. ఇలా ఒక్కో స్థానం నుంచి పలువురు టికెట్ ఆశించడం..ఇందులోనూ గ్రూపుల వారీగా ఆశావహులు ఉండటంతో అభ్యర్థుల ఎంపికలో అధిష్టానానికి తలనొప్పిగా మారుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో గ్రూపులుగా విడిపోయి నాయకులు, కార్యకర్తలు ఎవరికి వారు గ్రామాలు, పట్టణాల్లో పర్యటిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలుమార్లు ఇరు గ్రూపుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్న సందర్భాలున్నాయి. ఈ క్రమంలో ఒక గ్రూపుకు చెందిన వ్యక్తికి టికెట్ కేటాయిస్తే మరో గ్రూపునకు చెందిన వారు ఎన్నికల్లో సహకరిస్తారా లేదా అనేది అనుమానంగా మారుతోంది. ఎందుకంటే ఇప్పటికే ఆయా గ్రూపుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉంది. ఈ క్రమంలో ఆ పార్టీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఉత్కంఠ నెలకొంది. టికెట్ కేటాయింపులపై ఆలస్యం అవుతుండటంతో పార్టీ శ్రేణుల్లోనూ అయోమయం నెలకొంది.

ప్రశాంతంగా టెట్ నిర్వహణ

- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్లు

నవతెలంగాణ-నిర్మల్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) శుక్రవారం నిర్మల్ జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. ఉదయం, సాయంత్రం రెండు సెషన్లలో పరీక్ష కొనసాగింది. నిమిషం ఆలస్యం నిబంధన ఉండడంతో అభ్యర్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకున్నారు. కాగా పలు పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి పరిశీలించారు. కేంద్రాల్లో అధికారులతో మాట్లాడి వసతుల గురించి తెలుసుకున్నారు. వశిష్ఠ, గిరిజన ఆశ్రమ పాఠశాల, బాలుర, బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ఇతర కేంద్రాలను పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని, ఏటువంటి సమస్యలు తలెత్తిన ఉన్నతాధికారులకు లేదా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఈవో రవీందర్ రెడ్డి ఉన్నారు.



ఆదిలాబాద్‌టౌన్ : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను జిల్లాలో పకడ్బందీగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. అభ్యర్థులు ఉదయం గంట ముందుగానే పరిక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఆయా పరిక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు చేపట్టారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి అనుమతించారు. నిమిషం అలస్యం నిబంధన కారణంగా గంట ముందు నుండే పలు పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులను లోపలికి పంపారు. మరికొన్ని పరీక్ష కేంద్రాల్లో అరగంట ముందు నుండి లోపలికి పంపారు. ఒక్కో కేంద్రం వద్ద ఒక్కో నిబంధన ఉండడం గమనార్హం. శుక్రవారం పట్టణంలోని భుక్తాపూర్ లో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టెట్ పరీక్ష మొదటి పేపర్‌కు 33 పరీక్ష కేంద్రాల్లో 7716 మందికి గాను 7221 మంది హాజరై 495 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారన్నారు. అలాగే రెండవ పేపర్‌కు 14 కేంద్రాల్లో 3124 మందికి గాను 2955 మంది అభ్యర్థులు హాజరై 169 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. ప్రతి కేంద్రంలో అవసరమైన ఇన్విజిలేటర్‌లు, హాల్ సూపరింటెండెంట్‌లు, చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్మెంటల్ అధికారులు నియమించడం జరిగిందన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీఓ స్రవంతి, జిల్లా విద్యాశాఖ అధికారి టి. ప్రణీత, అధికారులు పాల్గొన్నారు.



వేతన ఒప్పందానికి అడ్డువస్తే సమ్మె తప్పదు

నవతెలంగాణ- మందమర్రి

అమలవుతున్న వేతన ఒప్పందానికి అడ్డు వస్తే సమ్మె తప్పదని సీఐటీయూ బ్రాంచ్ అధ్యక్షులు ఎస్.వెంకటస్వామి హెచ్చరించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కెకె 5 గనిపై ఆర్గనైజర్ చైతన్యరెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ గతంలో సీఐటీయూ డీపీఈ నిబంధనల సవరణ జరగాలని చెప్పామని ప్రస్తుతం 11వ వేతన ఒప్పందంలోని డీపీఈ గైడ్‌లైన్స్‌పై కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని సమస్య పరిష్కరించాలని లేదంటే అక్టోబర్ 5,6,7న సమ్మె చేస్తామని హెచ్చరించారు. యాజమాన్యం ఆలస్యం చేస్తున్న ఎల్టిసి, ఎల్ఎల్టిసి, పేటర్నిటి లీవుల సర్క్యులర్లు ఇవ్వాలని వేజ్ బోర్డు సభ్యులు కోల్ ఇండియాకు మందా నరసింహారావు లేఖ రాశారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కార్మికులకు హక్కులు లేకుండా చట్టాలు మార్చి చట్టబద్ధత లేని కోడ్స్ లాగా మారుస్తున్నారని, మరోవైపు బొగ్గు బావులను కోల్ ఇండియాలో వేలం వేస్తున్న తీరును కార్మికులు గమనించాలన్నారు. బొగ్గు ధరలు పెంచకుండా విదేశాల నుండి ఎక్కువ ధరకు తప్పనిసరిగా బొగ్గు దిగుమతి చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం చెప్పడం బొగ్గు పరిశ్రమను నిర్వీర్యం చేయడానికే అన్నారు. గతంలో ఇచ్చిన హామీలు పరిష్కారం చేయకుండా ఎన్నికలు కావాలని పట్టుబడుతున్నారని, 2సంవత్సరాల కాలవ్యవధితో రెండు ఓట్ల పద్ధతితోనే కార్మికులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. సింగరేణి క్వాటర్ల కబ్జాలు పెరుగుతున్నాయని జీఎం స్పందించి కబ్జాలకు గురైన క్వాటర్లను కార్మికులకు కేటాయించాలని కోరారు. ఆధారాలు లేకుండా సిఐటియు నాయకులుపై ఆరోపణలు చేస్తే ఊరుకునేదిలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ అల్లి రాజేందర్, ఉపాధ్యక్షులు వడ్లకొండ ఐలయ్య, శ్రీనివాస్, ఆదర్శ్, శివ, కార్మికులు పాల్గొన్నారు.



సీపీఎస్‌ను రద్దుచేసి ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలవాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ సంఘం ఉద్యోగ, ఉపాధ్యాయులు కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే జోగు రామన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ అమలు జరిగేలా ప్రభుత్వం చొరవ చూపేలా చేయాలని ఎమ్మెల్యేను కోరారు. పాత పింఛను అమలు చేయడం ద్వారా ప్రభుత్వానికి లాభమేనని ఎలాంటి భారం ఉండబోదని అందుకు పూర్తి సమాచారం అందజేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు దేశంలో హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్, పంజాబ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్ రాష్ట్రాలలో పాత పెన్షన్ అమలులో ఉందని మన రాష్ట్రంలో కూడా పాత పెన్షన్ అమలు చేసి దేశానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేస్తే 15వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి మిగులుతాయని, ప్రతినెల ఉద్యోగుల వాటా శాతం, వడ్డీ కూడా మిగులుతుందని తెలిపారు. దీనికి ఎమ్మెల్యే స్పందించి ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర సహ అధ్యక్షులు సెర్పూర్ సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు ఇజ్జగిరి రాందాస్, ప్రధాన కార్యదర్శి నవీన్, కోశాధికారి అవినాష్, ప్రముఖ కవి, రచయిత, ఉపన్యాసకుడు చిందం ఆశన్న, ఉపాధ్యాయులు రాజేశ్వర్, సంజయ్, సంతోష్‌లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వశిక్షా ఉద్యోగుల నిరసన దీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యాశాఖ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారంతో ఈ సమ్మె 18వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా సమ్మె శిబిరం వద్ద ఉద్యోగులందరు మహాత్ముడి మార్గంలో నిరసన అంటూ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులందరు కళ్లకు నోటికి, చెవులకు నల్ల గుడ్డలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ మినిమం టైం పేస్కేల్ కల్పించాలని కోరారు. రూ.10 లక్షల జీవితబీమా, ఆరోగ్యబీమాను కల్పించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయ సమ్మతమైన డిమాండ్లను నెరవేర్చేవరకు తమ పోరాటం కొనసాగిస్తామన్నారు.

ఓటరు జాబితాలో చేర్చేందుకు చర్యలు

నవతెలంగాణ- నస్పూర్

ఓటరు జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా గిరిజనులను ఓటరు జాబితాలో చేర్చేందుకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టడం జరుగుతుందని మంచిర్యాల రాజస్వ మండల అధికారి రాములు తెలిపారు. శుక్రవారం నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో సవరణలపై మంచిర్యాల మున్సిపల్ పరిధిలోని ఎన్‌టిఆర్ నగర్ కాలనీలో మంచిర్యాల మండల తహసిల్దార్ భోజన్నతో కలిసి ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో 18, 19 సంవత్సరాలు వయసు నిండిన గిరిజనుల వివరాలు ఓటరు జాబితాలో నమోదు చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం ఓటు హక్కు విలువ, ఎన్నికల సమయంలో ఓటు వినియోగం ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ గడియారం శ్రీహరి, వార్డు కౌన్సిలర్ సుంకరి శ్వేతా రమేష్, బదావత్ ప్రకాష్, బూత్ స్థాయి అధికారి రేణుక సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పోరాట వారోత్సవాలు

నవతెలంగాణ- తాండూర్

తాండూర్ గ్రామంలో 75వ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను సందర్భంగా రైతు సంఘం మంచిర్యాల జిల్లా కార్యదర్శి కొండు బానేష్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4500 మంది ప్రాణత్యాగాలు చేసి 10 లక్షల ఎకరాల భూమిని 3 వేల మందికి పంపిణీ చేసిన ఘనత కమ్యూనిస్టులదేనన్నారు. భూస్వాములు, పెత్తందారులు అరాచకాలకు వ్యతిరేకంగా రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమల, మల్లు స్వరాజ్యం, నల్ల నరసింహులు వంటి ఎంతోమంది కమ్యూనిస్టులు పోరాడారని తెలిపారు. వారి పోరాటం ఫలితంగానే నేటి నిరంకుశ పాలన పెత్తనం దారి వ్యవస్థల నుంచి విముక్తి కలిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ తాండూర్ శాఖ కార్యదర్శి ఇందారపు రాజేష్, ఇందారపు పోషం, కంబాల చందు, కొండ సాయికుమార్, కరవేనా కల, బానయ్య పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

నవతెలంగాణ-తాంసి

వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రతను పాటించాలని పీహెచ్‌సీ వైద్యురాలు శ్రావ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో డ్రై డేను నిర్వహించారు. పరిసరాలను పరిశీలిస్తు నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రోగం వస్తే ఆర్ఎంపీ వైద్యాన్ని నమ్మకుండా ప్రభుత్వ ఆస్పత్రిలో చూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, ఆరోగ్య సిబ్బంది నాగేశ్వర్, లక్ష్మీ, ప్రభావతి పాల్గొన్నారు.

కేజీబీవీలో వైద్య శిబిరం

నవతెలంగాణ - కాసిపేట

మండల కేంద్రంలోని కస్తూరిభాగాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం మండల వైద్యాధికారులు సీజనల్, గైనిక్, సాధారణ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం 145 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి,78 మంది విద్యార్థులకు అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో హెూమియో వైద్యురాలు శ్రీదేవి, ఆయుర్వేదిక్ వైద్యుడు సంజయ్ కుమార్, పాఠశాల ప్రత్యేక అధికారి సరిత, పాఠశాల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట పలువురు బైండోవర్

నవతెలంగాణ- జైపూర్

మంచిర్యాల నుండి చెన్నూరు వైపు అనుమానస్పదంగా ప్రయాణిస్తున్న 8 మందిని అదుపులోకి తీసుకొని స్థానిక తహసిల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు స్థానిక ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. శుక్రవారం ఉదయం ఇందారం ఎక్స్‌రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా హాజీపూర్, దండేపల్లి మండలానికి చెందిన ఎనిమిది మంది పందెం కోళ్లతో కారులో అనుమానస్పదంగా ప్రయాణిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు పట్టుబడిన వారిని జైపూర్ తహసీల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు పేర్కొన్నారు.

అర్హులకు బీసీ రుణాలు అందించాలి

నవతెలంగాణ-నిర్మల్

ఎన్నికల కోడ్ రాకముందే అర్హులైన బీసీలకు సబ్సిడి రుణాలు అందించాలని బీసీ సంక్షేమ సంఘము జిల్లా అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోనే ఎన్నికల కోడ్ వచ్చేలా ఉందని, దాని కంటే ముందే బీసీ రుణాలు అందిచాలని అన్నారు.

మళ్లీ కాంగ్రెస్ గూటికి మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలు



నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ ఉద్యమకారుడు, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలు మళ్లీ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో భార్య, మంచిర్యాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మితో కలిసి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చెన్నూర్ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో తనను తప్పించి బాల్క సుమన్‌కు చెన్నూర్ టిక్కెట్ కేటాయించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత బీఆర్ఎస్ అధిష్టానం భార్యకు జడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించింది. బాల్క సుమన్ అన్నీతానై వ్యవహారం నడిపించడంతో కొన్ని రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వెనువెంటనే తిరిగి సొంత గూటికి చేరారు. ఈ సారి కూడా చెన్నూర్ టికెట్ బాల్క సుమన్‌కే కేటాయించడంతో తన రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంలో పడిందని భావించి కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రలోభలకు లొంగకుండా ఓటు వేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల్లో ఎలాంటి ప్రలోబాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలోని అంబేద్కర్ భవనంలో ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యత, నైతిక ఓటింగ్‌పై శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఇందులో దాదాపు 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో నుంచి 13 మంచి పెయింటింగ్‌లను ఎంపిక చేసి ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహులను ఎంపిక చేశారు. మొదటి బహుమతి రూ.5 వేలు, రెండవ బహుమతి రూ.3వేలు, మూడవ బహుమతి రూ.2 వేలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువత తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలన్నారు. ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, మిత్రుల, బంధువులు, కుటుంబ సభ్యుల పేర్లు కూడా నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. అక్టోబర్ 1, 2023 నాటికి 18 ఏళ్లు నిండిన వారు తమ పేరును ఈ నెల 19లోగా నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, డిడి మధుసూదన్, విద్యార్థులు, పాల్గొన్నారు.

రోడ్లపై పశువులను వదిలితే చర్యలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రోడ్లపై పశువులను వదిలితే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు, మత పెద్దలతో వినాయకచవితి ఉత్సవ వేడుకల నిర్వహణపై శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను పట్టణంలో ఘనంగా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని అన్నారు. ప్రతి వార్డులో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని, రూట్ మ్యాప్‌ను ఏర్పాటు చేసుకొని రోడ్లపై గుంతలు పూడ్చాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పశువుల యజమానులు రోడ్లపై పశువులను వదలకూడదని, నిబంధనల మేరకు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. లూజ్ వైర్లను సరిచేయాలని, నిరంతరం విద్యుత్ సరఫరా అందిస్తూ పర్యవేక్షించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. పెన్ గంగా, చాంద వద్ద అవసరమైన క్రేన్‌లు, విద్యుత్, ఇతర సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పట్టణంలోని ముఖ్య కూడళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అంబులెన్సు, అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ స్రవంతి, డీఎస్పీ ఉమేందర్, మున్సిపల్ కమీషనర్ శైలజ, ఉత్సవ కమిటీ సభ్యులు, మత పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీరింగ్ డే

నవతెలంగాణ - మందమర్రి

మందమర్రి సింగరేణి జీఎం కార్యాలయంలో ఇంజనీరింగ్ డేను ఘనంగా నిర్వహించారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా శుక్రవారం మందమర్రి జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా జనరల్ మేనేజర్ ఏ.మనోహర్ పాల్గొని విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ మోక్షగుండం నిజాయితీ, క్రమశిక్షణ, గొప్ప వ్యక్తిత్వం స్మరించుకోదగిన ఆయన జయంతిని ఇంజనీర్‌డేగా జరుపుకుంటున్నామని తెలిపారు. 1861 సెప్టెంబర్ 15న బెంగళూరు సమీపంలో మద్దెనహళ్లిలో పేద కుటుంబంలో జన్మించిన విశ్వేశ్వరయ్య పూర్వీకులు తెలుగువారు కావడం గర్వించదగ్గ విషయం అన్నారు. దేశం గర్వించే ఇంజనీర్ అని, వారి స్ఫూర్తితో దేశ అభివృద్ధి లో అందరూ భాగం కావాలని, ప్రపంచ స్థాయిలో తన ప్లానింగ్‌లకు కట్టడాలకు ప్రత్యేక గుర్తింపు సాధించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం నాగరాజు, డీజీఎం సివిల్ శ్రీనివాసులు, రాందాసు ఏజెంట్, రాజన్న డీజిఎం ఐఈడి, ఎం రవీందర్ ఏరియా సేఫ్టీ ఆఫీసర్, ఎస్.శ్యాంసుందర్ పర్సనల్ మేనేజర్, ప్రభాకర్ పర్యావరణ అధికారి, గనుల డిపార్ట్మెంట్ల ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

నవతెలంగాణ- నస్పూర్

హార్డ్‌వేర్, ఎలక్ట్రిక్ షాపులలోని కౌంటర్ నుండి నగలు దొంగలించిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలిస్తున్నట్లు నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ పట్టణానికి చెందిన ఎండి ఆసిఫ్ బేగ్, ముజీబ్ అలీ అనే ఇద్దరు గత 2007 నుండి దొంగతనాలకు పాల్పడుతున్నారని, వీరిపై ఇప్పటికే పోలీస్ స్టేషన్లో కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. సెప్టెంబర్ 12వ తేదీ సోమవారం రోజున మెయిన్ రోడ్ ఫ్లడ్ కాలనీకి వెళ్లే దారి సమీపంలో ఇద్దరు వ్యక్తులు ఇంటి నిర్మాణం కొరకు సామాను చూపించమని అడగడంతో, యజమాని షాప్ లోపలికి వెళ్లి సామాను చూపిస్తుండగా ఇంకొక వ్యక్తి కౌంటర్‌లో నుండి రూ. 1,50,000 నగదును దొంగలించి యజమానికి తెలియక ముందే అక్కడి నుండి బైక్ పై పారిపోయారని పేర్కొన్నారు. యజమాని కౌంటర్లో చూడగా నగదు కనిపించకపోవడంతో వెంటనే వెంటనే 100కి డయల్ చేసి పోలీస్ లకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి, ఆధారంగా నిందితులని శుక్రవారం తోళ్లవాగు సమీపంలో అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల వద్ద నుండి రూ. 75 వేల నగదును, బైకును స్వాధీనం చేసుకొని రిమాండ్ చేసినట్లు తెలిపారు. వీరిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య, నస్పూర్ ఎస్.ఐ సంతోష్, కానిస్టేబుల్ సతీష్, మంచిర్యాల డీసీపీ రాంనాథ్ సుధీర్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి అభినందించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | సెప్టెంబర్ 16, 2023 | www.navatelangana.com

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని నిర్మల్ డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన పలువురు గ్రామస్తులు, యువకులు కాంగ్రెస్‌లో చేరారు.



వీరందరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యకర్తలు కష్టపడి పని చేయాలని, కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈటెల శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, సమ్మెట రవి, దినేష్, వినేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన రిటైర్డ్ ఎంప్లాయిస్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవన నిర్మాణానికి రూ.20లక్షల నిధులను మంజూరు చేయడం పట్ల అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే జోగు రామన్నను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవన నిర్మాణానికి రూ.20లక్షల నిధులను మంజూరు చేయడం జరిగిందని అన్నారు. భవన నిర్మాణానికి తమ వంతుగా పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. పదవి వీరమణ పొందిన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పూర్తి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, కిష్టయ్య, అశోక్, రాజేశ్వర్‌రెడ్డి, గోపీనాథ్‌గౌడ్, జలంధర్, గంగన్న, భోజారెడ్డి, నరేందర్, రమేష్, దేవిదాస్ దేశ్‌పాండే పాల్గొన్నారు.

అద్భుత కట్టడాలను సృష్టిస్తున్న ఇంజనీర్లు

• ఘనంగా ఇంజనీర్స్ డే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కట్టడాలతో ఇంజనీర్లు అద్భుతాలు సృష్టిస్తున్నారని, తమ ప్రతిభతో సమాజ అవసరానికి తగ్గట్లుగా నిర్మాణాలు చేస్తున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఇంజనీర్స్‌డే ఘనంగా నిర్వహించారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా నిర్వహించే ఇంజనీర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆర్కిటెక్చర్స్, ఇంజనీర్స్ అండ్ ఎల్టీపీఎస్ అసోసియేషన్ అధ్వర్యంలో ఇంజనీర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో అంబుజా సిమెంట్ ఇతర 14 కంపెనీల స్టాళ్లను ఎమ్మెల్యే ప్రారంభించి, ఆయా కంపెనీల ప్రతినిధుల నుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించడం పట్ల నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య తన ఇంజనీరింగ్ ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు సాధించారని, ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. ఇంజనీర్ల ద్వారా సమాజానికి ఎంతో మేలు జరిగిందని గుర్తు చేశారు. ప్రపంచంలోనే అతి పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను రాష్ట్రంలో నిర్మించి ప్రపంచ గుర్తింపు సాధించారని అన్నారు. వరదలు, భారీ వర్షాలు వచ్చినా నష్టం జరగకుండా నిర్మాణాలు నిర్మించడం వారి ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే ఇంజనీర్ల సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, అసోసియేషన్ అధ్యక్షులు అన్నదానం జగదీశ్వర్, యోగేశ్వర్, వేదాంత్, సయ్యద్ జాబీర్ అలీ, బండారి విజయ్, శ్రీనివాస్, రాజు, సందీప్ పాల్గొన్నారు.



స్టాళ్లలో సిమెంట్ ఉత్పత్తుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజనీర్స్ డే వేడుకలు...

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినోత్సవం సందర్భంగా ఇంజనీర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్, కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ్ పాల్గొని, మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమని అన్నారు. విద్యార్థులు శరవేగంతో విస్తరిస్తున్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు ఆకలింపు చేసుకొని మేలైన కొత్త పద్ధతులను తాము చేపట్టే పనుల్లో అమలు పరచాలని సూచించారు. సృజనాత్మకమైన వృత్తి నైపుణ్యాలతో, పరిమితమైన వనరులతోనే నాణ్యమైన పనులు నిర్వహించిన భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అడుగుజాడల్లో నడవాలని అన్నారు. అనంతరం ఇంజనీర్స్ డే సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సోలోమన్‌ను శాలువా, మెమోంటోతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల విభాగాల అధిపతులు రాజ్ కుమార్, క్రాంతి కుమార్, సుజయ్, రాజన్న, సురేష్, అధ్యాపకులు శ్రీనివాస్, విజయలక్ష్మి, ప్రవీణ్, రామేశ్వర్‌రెడ్డి, యశశ్రీ, గజానంద్ రావు, సుధాకర్, రవికుమార్, జ్యోత్స్న రాణి, హేమలత, కుమారస్వామి, మురళీకృష్ణ ఉన్నారు.


పాలిటెక్నిక్ కళాశాలలో...

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



నవతెలంగాణ-నార్నూర్

అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మె కొనసాగుతుంది. శుక్రవారం నాటికి ఐదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ 46 సంవత్సరాల పైగా ఐసీడీఎస్‌లో వివిధ సేవలందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో అంగన్‌వాడీలు కే.పంచశీల, జే పంచపూల, ఆర్ స్యామక, ఏ.కమల, ప్రేమబాయి, డి మల్లు, జే.సుజాత, ఎ. జయశీలా, కే లక్ష్మి కే.ధృపతా వివిధ గ్రామాల అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఘనంగా పొలాల అమావాస్య పండుగ ముగింపు వేడుకలు



నవతెలంగాణ-కడెం

మండలంలోని ధర్మాజీపేట్ గ్రామపంచాయతీ పరిధిలోని రెవోజీపేట్ గ్రామంలో ఆదివాసీ గిరిజనులు పొలాల అమావాస్య పండుగ వేడుకలు శుక్రవారం ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాల మధ్య ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజనులు జాగే మతరే అంటు పొలిమేర గట్ల వరకు వెళ్లి అక్కడ పొలిమేర చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడే వన భోజనాలు చేసి అక్కడినుండి ఇంటికి వచ్చేటప్పుడు అడవిలో దొరికే పూలు తదితర వాటిని ఇంటికి తీసుకువచ్చి ఇంట్లో దేవతలకు ప్రతేక పూజలు నిర్వహించారు. పొలాల అమావాస్య పండుగ వేడుకలతో గ్రామంలో పూర్తిగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కులస్తులు ప్రభాకర్, కాంతారావు, శేఖర్, చందు, తిరుపతి, రమేష్ ఆదివాసులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేయాలని వినతి



నవతెలంగాణ-కడెం

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేయాలని మండలానికి చెందిన లబ్ధిదారులు శుక్రవారం ఎమ్మెల్యే రేఖానాయక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉన్నట్టు తెలుసుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేకు తమ సమస్యలను విన్నవించారు. ఎమ్మెల్యే రేఖా నాయక్‌ను ఇల్లు లేని పేదలు కలిసి వారి సమస్యలను విన్నవించారు అయితే ఆ విషయంపై ఎమ్మెల్యే స్పందించి మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో కొంత ఆలస్యం జరగడం వాస్తవమేనని అయితే నూతనంగా నిర్మిస్తున్న ఇండ్లలో మౌలిక సౌకర్యాలు కల్పన పూర్తి కాలేదని ఎలక్షన్ల తర్వాత పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, స్థానిక నాయకులు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటనలకే పరిమితమైన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎమ్మెల్యే జోగు రామన్న చెప్తున్న అభివృద్ధి కేవలం ప్రకటనలకే పరిమితమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆమె కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధి పనులు పూర్తి కాకుండానే ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కోర్ట, చనాక ద్వారా ఒక ఎకరానికైనా సాగునీరు అందిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని, ఇవ్వలేదని తను నిరూపిస్తే ఎమ్మెల్యే రాజకీయ సన్యాసం తీసుకుంటారని సవాల్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రూ.120 కోట్లు మంజూరు చేస్తే, రాష్ట్ర వాటాగా కేవలం రూ.30 కోట్లు తీసుకురాలేక 2018 పూర్తి అవ్వాల్సిన ఆస్పత్రిని, ఆలస్యంగా ప్రారంభించినా, ఇప్పటికీ సూపర్ స్పెషాలిటీ సేవలు ప్రారంభించలేక పోయారని అన్నారు. అలాగే దశాబ్దాల కల తీరనుందని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై హోర్డింగ్ పెట్టుకున్న రామన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి ఎక్కడ ప్రారంభమయ్యిందో చూపాలని, అటు పట్టణాభివృద్ధి జరిగిందని చెప్పుకుంటున్న కాలనీల్లో ఎక్కడ కూడా కనీస అవసరాలు కల్పించలేక పోతున్నారని అన్నారు. ఇకనైనా అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని ఎమ్మెల్యేను హితవు పలికారు. ఇప్పటికైనా ప్రజలు వాస్తవాలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, కొత్తపెల్లి సంతోష్, సతీష్‌రెడ్డి, తాటి సతీష్, వెంకట్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, అశాంత్, సబ్దర్, కాంత, సరిత, వెంకటేష్, లస్మరెడ్డి, మోహన్‌గౌడ్ ఉన్నారు.

ఘనంగా తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు



నవతెలంగాణ-బోథ్

తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ సమీపంలోని శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి గోవర్ధన్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం దేశ చరిత్రలో చెదరని చరిత్రగా నిలిచిపోయిందని అన్నారు. రాష్ట్రంలో ఐదు సంవత్సరాలు నిరాటంకంగా సాగిన ఈ పోరాటంలో దాదాపు 4000 మంది మృతి చెందారని అన్నారు. నాటి తెలంగాణ ప్రాంతంలోని గ్రామాల్లో వెట్టిచాకిరీ వ్యవస్థను నిర్మూలించడం జరిగిందన్నారు. అలాగే దున్నేవాడికి భూమి ఉండాలనే నినాదంతో పోరటాలు చేయడం జరిగిందన్నారు. కమ్యూనిస్టు ప్రజాప్రయోజన పోరాటం ఈ భూమి ఉన్నంత వరకు చరిత్ర నిలిచిపోతుందని కొనియాడారు. అనంతరం అమరవీరుల స్థూపనికి నివాళులర్పించి వారి ఆశయాలను కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గోదావరి, పట్టణ అధ్యక్షులు నరేష్, దాస్, భోజన్న, కార్మికులు పాల్గొన్నారు.

పురుగులమందు పిచికారిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

పురుగులమందు పిచికారిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులు స్ప్రే చేసేటపుడు వ్యక్తిగత పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సింజెంటా, టీఎంఐ కంపెనీల అధికారులు ఎస్ఏఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ అశోక్‌రెడ్డి వివరించారు. శుక్రవారం మండలంలోని భీంసరి గ్రామంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రైనర్లు మెస్రం ప్రసాద్ మాట్లాడుతూ స్ప్రే చేసేప్పుడు మాస్కులు దరించాలని, కండ్లజోడు పెట్టుకోవాలని సూచించారు. శరీరంపై మందు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కాళ్లకు బూట్లు వేసుకోవాలని అన్నారు. మందు కొట్టిన తరువాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోని స్నానం కూడా చేయాలని సూచించారు. స్ప్రే చేసిన కాళీ మందుడబ్బలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా భూమిలో పాతిపెట్టాలన్నారు. చిన్నపిల్లలకు స్ప్రే మందులు అందుబాటులో లేకుండా చూడాలన్నారు ఈ జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని సూచించారు. పీపీ కిట్స్ కూడా పంపిణి చేశారు. ఈ సంద్భంగా ట్రైనర్ మెస్రం ప్రసాద్‌తో పాటు ఆదిలాబాద్ గ్రామసర్పంచులు, ఎంపీటీసీలు, ఏఐవైఎఫ్ జిల్లా కన్వనర్ మెస్రం భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి జాతీయ సైన్స్ సెమినార్ పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో డైట్ కళాశాలలో శనివారం ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి జాతీయ సైన్స్ సెమినార్ పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిరుధాన్యాలు ఒక ఉత్తమమైన ఆహారమా లేదా అది వ్యామోహమా అనే అంశంపైన సెమినార్ ఉంటుందని తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో పొందిన సైన్స్ సెమినార్ విజేతలు రాష్ట్రస్థాయికి ఎంపిక అవుతారని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కే.రఘు రమణ 9440060288ను సంప్రదించాలని సూచించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

• రహదారిపై భోజనాలు చేస్తూ నిరసన



నవతెలంగాణ-బాసర

రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవార్ రామారావు పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 5వ రోజుకు చేరుకుంది. వీరి సమ్మెకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవర్ రామారావు పటేల్ మద్దతు తెలిపారు. వంట వార్పు చేసి నిజామాబాద్, భైంసా రహదారిపై భోజనాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాట్లాడుతూ ఐదు రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించి, నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద అంగన్‌వాడీ టీచర్లకు రూ.10లక్షలు, హెల్పర్లకు రూ.5లక్షల ఇతర బెనిఫిట్స్ అందజేయాలని అన్నారు. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్, భైంసా రహదారిపై బీజేపీ నాయకులు అంగన్‌వాడీలతో కలిసి నిరసన తెలిపారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. కార్యక్రమంలో సర్పంచ్ మధుకర్ పటేల్, ఉపసర్పంచ్ శంకర్ పటేల్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయినాథ్ పటేల్, అంతగిరి రాజన్న, సుద్ద సాయిబాబా, కిషోర్ దేశాయ్, నర్సింగ్ రావు, నారాయణరెడ్డి, సాయినాథ్, రమేష్, జలందర్, శైలేష్ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : అంగన్‌వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతుంది. శుక్రవారం వర్షాన్ని సైతం లెక్క చేయకుండా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేసి, క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి లలిత, మండల అధ్యక్షురాలు వెంకట్‌లక్ష్మి, కార్యదర్శి భాగ్యలక్ష్మి, విజయ, వరలక్ష్మి, పద్మ, కె.సునీత, రాజమణి, మండల అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వర్చువల్ విధానంలో మెడికల్ కాలేజ్‌ను ప్రారంభించిన సీఎం కేసీఆర్

• మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ, సంబురాలు

నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్ర వ్యాప్తంగా 9 మెడికల్ కాలేజ్‌లను వర్చువల్ విధానంలో సీఎం కేసీఆర్ ప్రారంభించారు. అయితే శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌లో గల నూతనంగా నిర్మించిన మెడికల్ కాలేజ్‌ను సైతం ప్రారంభించారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులతో కలిసి ర్యాలీని కళాశాల వరకు నిర్వహించారు. అనంతరం తరగతి గదులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు వైద్యరంగంలో తెలంగాణ దేశంలోనే అత్యుత్తమ సేవలు అందిస్తుందని అన్నారు. ఇప్పటికే ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీలు మంజూరు చేశారని అన్నారు. మిగతా జిల్లాలకు సైతం మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేస్తారని అన్నారు. రాష్ట్రంతో పాటు జిల్లాలను ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. గత ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో మూడు మెడికల్ కాలేజీలు ఉండేవని, తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాబోయే రోజుల్లో 33 జిల్లాలకు మెడికల్ కాలేజీలు వస్తాయని తెలిపారు. అనంతరం ప్రజాప్రతినిధులు నాయకులు విద్యార్థులతో కలిసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మెన్ విజయలక్ష్మి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు అధికారులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



'కుష్టు వ్యాధి ప్రాణాంతకమైంది కాదు'



నవతెలంగాణ-తాంసి

కుష్టు వ్యాధి ప్రాణాంతకమైన వ్యాధి కాదని జిల్లా కుష్టు వ్యాధి నిర్మూలన ప్రత్యేక అధికారి డాక్టర్ మేట్‌పెల్లి శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. అనుమానిత 20 మందికి పరీక్షలు నిర్వహించగా ముగ్గురు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించడం, మందులను అందజేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కుష్టు వ్యాధి ప్రాణాంతకమైనది కాదు కానీ నిర్లక్ష్యం చేస్తే అంగవైకల్యంగా మారుతారని అన్నారు. అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా వైద్యం అందించడంతో పాటు మందులను అందజేస్తామని అన్నారు. వ్యాధిగ్రస్తులకు పోషకాహారంతో పాటు మందులను ప్రతిరోజు వేసుకోవాలని,

పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. ఆశాకార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు వారి ఇండ్ల సందర్శనలు చేస్తూ వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిల్ రాజ్, డీపీఎంఓ వామన్‌రావు, మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు బి.గంగాధర్, ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, ప్రయోగశాల నిపుణులు రమణాచారి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మనసు తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | సెప్టెంబర్ 16, 2023 | www.navatelangana.com

చేపల వేటకు వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ - బెజ్జూర్



చేపల వేటకు వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బారెగూడెం గ్రామానికి చెందిన ఆత్రం భీంరావు(45) గురువారం చేపల వేట కోసం బారెగూడెం వాగు సమీపంలోకి వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో గల్లంతయ్యాడు. శుక్రవారం కోర్తగూడ సమీపంలో భీంరావు మృతదేహం లభించింది. కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య గంగుబాయి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

20న భగీరథ కార్మికుల మహాధర్నా

నవతెలంగాణ-ఆసిఫాబాద్



భగీరథ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని భగీరథ కార్మిక సంఘం జేఏసీ నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 15 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, అధికారుల పట్టింపు లేని తనాన్ని ప్రశ్నిస్తూ 20న మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మిక సంఘం జేఏసీ కన్వీనర్ లింగయ్య, కో-కన్వీనర్లు బోగే ఉపేందర్, అల్లూరి లోకేష్ పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణకు నవోదయ విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ-కాగజ్‌నగర్



హరిప్రియ

అంతర్జాతీయ శాస్త్రీయ విజ్ఞాన కేంద్రం (ఐఐటీ)లో ప్రత్యేక శిక్షణకు కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థిని ఎంపికైంది. సైబర్ నేరాల నివారణ, దీనికి శాస్త్ర, సాంకేతికను ఎలా వినియోగించుకోవాలనే విషయంలో ఎనిమిదో తరగతి విద్యార్థిని హరిప్రియ ఈ నెల 23 నుండి 25 వరకు హైద్రాబాద్‌లోని ఐఐటీలో ప్రత్యేక శిక్షణ తీసుకోనుందని విద్యాలయం ప్రిన్సిపల్ బి చక్రపాణి తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలలో కలిపి 18 మంది విద్యార్థులను ఎంపిక చేయగా, ఇందులో కాగజ్‌నగర్‌లోని నవోదయ విద్యాలయానికి చెందిన హరిప్రియ ఎంపిక కావడం అభినందనీయమని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చక్రపాణి వివరించారు.

ప్రశాంతంగా టెట్



నవతెలంగాణ- ఆసిఫాబాద్

కొమరం భీం జిల్లాలో శుక్రవారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష కోసం జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్‌లో 21 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి పేపర్ ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగగా మొదటి పేపర్లో 4851 మందిగాను 4477 మంది హాజరయ్యారు. 374 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించిన టెట్ రెండవ పేపర్‌కు 2090 మందికి గాను 1958 మంది హాజరుకాగా 132 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ రవికాంత్‌రావు పరిశీలించారు.

కాగజ్‌నగర్ : ఉపాధ్యాయ అర్హతా పరీక్ష (టెట్)ను శుక్రవారం కాగజ్‌నగర్‌లో ప్రశాంతంగా నిర్వహించారు. పలు పరీక్షా కేంద్రాలలో ఉదయం 9-30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2-30 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. పట్టణంలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద కోనేరు ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష రాసే విద్యార్థులకు రెండేసి చొప్పున అరటిపండ్లను అందించారు. జెడ్పీ వైస్ ఛైర్మన్ కోనేరు కృష్ణారావు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాచకొండ గిరీష్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వీవీ ప్రసాద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కడంబలో ప్రజాబంధు వైద్య శిబిరం



నవతెలంగాణ - కాగజ్‌నగర్‌రూరల్

మండలంలోని కడంబ గ్రామంలో ప్రజాబంధు పాల్వాయి పురుషోత్తంరావు 24వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు, డాక్టర్ శ్రావణ్ కుమార్, డ్యూటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. 250 మంది జ్వర పీడితులు, కీళ్ల నొప్పులు, ఇతర సమస్యలు ఉన్న రోగులను పరీక్షించి, రక్త పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కడంబా సర్పంచ్ బూరం రాజేశ్వరి రాజు, గన్నారం సర్పంచ్ దోతుల శ్రీనివాస్, పుల్ల అశోక్, మాజీ జెడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య, ఎంపీటీసీ దుర్గం మోతిరామ్, ఎంపీటీసీ పిర్సింగుల తిరుపతి, మాజీ ఎంపీటీసీ తాళ్ళ రామయ్య, ఉప సర్పంచ్ అన్నం మారయ్య, రాకేష్, కుకడకర్ రమేష్, దుబ్బుల మురళి, ముక్కెర శేఖర్, పుల్లబోయిన బానయ్య, జల్ల శ్రీ శైలం, మళ్ళబోయిన జనార్ధన్, చౌదరి సాయి కిరణ్, భీమాంకర్ బాబురావు పాల్గొన్నారు.

అందవెల్లిలో..

అందవెల్లి గ్రామంలో స్పర్శ ఫౌండేషన్, సిర్పూర్ పేపర్ మిల్లు ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మిల్లు జనరల్ మేనేజర్ ఎంఎస్ గిరి మాట్లాడుతూ వాతావరణం మార్పులు వల్ల కలిగే వ్యాధుల కోసం ప్రత్యేకంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. డాక్టర్ బాను ప్రకాష్, పేపర్ మిల్లు వైద్య సిబ్బంది రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మిల్లు ప్రతినిధిలు తుమ్మ రమేష్, గ్రామ సర్పంచ్ మొకర్తి గంగన్న, మిల్లు హాస్పిటల్ సిబ్బంది జయసింహ, సుజాత, తన్నీరు విజయ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పెండింగ్ పీఆర్సీలు చెల్లించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న రెండు పిఆర్సిలతో పాటు డిఏలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. డిపో ఆవరణలో కార్మికులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం శుభ పరిణామమన్నారు. ఇదే సందర్భంలో 2013 పిఆర్సి బాండ్ల ఏరియర్స్ డబ్బులు వడ్డీతో సహా చెల్లించాలని, 2017, 2021 పిఆర్సి పేస్కేల్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 9 డిఏ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని, సీసీఎస్‌కు చెల్లించాల్సిన డబ్బులను వడ్డీతో సహా ఇవ్వాలని అన్నారు. ఉద్యోగుల నుంచి చేస్తున్న రికవరిలను ప్రతి నెల చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ ఆసిఫాబాద్ డిపో కార్యదర్శి టి.దివాకర్, నాయకుల సులేమాన్, డేవిడ్, కళ్యాణ్, అయుబ్, రషీద్, వెంకటయ్య, పోచం, సదానందం పాల్గొన్నారు.

ప్రతిపక్షాలు అధికారంలోకి వస్తే రాష్ట్రానికి దరిద్రమే

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి
- జిల్లా కేంద్రంలో వైద్య కళాశాలకు ప్రారంభోత్సవం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రతిపక్షాలు అధికారంలోకి వస్తే రాష్ట్రానికి దరిద్రం పడుతుందని, వర్షాలు కూడా పడే పరిస్థితి ఉండదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి కేసీఆర్ 9వైద్య కళాశాలలను వర్చువల్‌గా ప్రారంభించగా, జిల్లా కేంద్రంలోని అంకుసాపూర్ పరిధిలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వర్చువల్‌గా కళాశాలల ప్రారంభోత్సవం అనంతరం సీఎం మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ మెడికల్ సీట్లలో ఆదర్శంగా నిలిచిందన్నారు. దేశవ్యాప్తంగా 43శాతం సీట్లు ప్రస్తుతం రాష్ట్రంలో అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. వైద్యవృత్తి పవిత్రమైందని, విద్యార్థులు సేవాపరులై ముందుకు సాగాలన్నారు. కుమురం భీం లాంటి జిల్లాకు కూడా అభివృద్ధి కావడానికి మెడికల్ కళాశాల ఊతం ఇస్తుందని తెలిపారు. సభా అధ్యక్షుడు ఆత్రం సక్కు మాస్ మల్లారెడ్డి అని సంబోధించడంతో సభా ప్రాంగణం నినాదాలతో దద్దరిల్లింది. అనంతరం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 9 సంవత్సరాల ముందు రాష్ట్రంలో తాగునీరు, కరెంటు, పంటలు లాంటివి లేక ప్రజలు అల్లాడిపోయారని అన్నారు. ప్రతిపక్షాలు అధికారంలోకి వస్తే తిరిగి అదే పరిస్థితి వస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు 9 వైద్య కళాశాలలు ప్రారంభం కావడం రాష్ట్ర చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గరోజన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై రూ.125000 ఖర్చు చేస్తూ మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసిందన్నారు. పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దొంగ అని అభివర్ణించారు. బిజెపి, కాంగ్రెస్ మాటలు నమ్మితే మోసపోతారని తెలిపారు. ప్రపంచంలో అమెరికా తర్వాత ఐటీ పరిశ్రమలు అత్యధికంగా ఉన్న రాష్ట్రం తెలంగాణ అని గర్వంగా చెప్పుకోవచ్చన్నారు. ఎస్టీల అభివృద్ధి కోసం కేజీ టు పీజీ ఉచిత విద్య ప్రవేశపెట్టిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రసంగం ముగించే సందర్భంలో సభలో నుండి మల్లారెడ్డిని సామాజిక మాధ్యమాల్లో ప్రసిద్ధి చెందిన డైలాగ్ చెప్పమని అడగడంతో చివర్లో అందరిని ఆకట్టుకునేలా 'పాలమ్మిన, పూలమ్మిన, బోర్వెల్ నడిపిన, స్కూలు నడిపిన, మెడికల్ కళాశాల స్థాపించిన, ఇంజనీరింగ్ కళాశాల స్థాపించిన' అనే డైలాగ్ చెప్పడంతో సభ మార్మోగింది. కలెక్టర్ బోర్కడే హేమంత్ మాట్లాడుతూ సెప్టెంబర్ 15 చాలా ముఖ్యమైన రోజు అని, 9 కళాశాలలు ఒకేసారి ప్రారంభం కావడం గొప్ప విషయమని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో 100 సీట్లతో మెడికల్ కళాశాల ప్రారంభం అవుతుందని, రానున్న రోజుల్లో ఇది అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.

జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ

జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల ప్రారంభోత్సవంలో భాగంగా మంత్రి మల్లారెడ్డి రాక సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అటవీ శాఖ చెక్ పోస్ట్ వద్దకు మల్లారెడ్డి చేరుకోగానే శ్రేణులు స్వాగతం పలికి ఓపెన్ టాప్ జీపులో మెడికల్ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్, కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా కేంద్రానికి మొట్టమొదటిసారిగా వచ్చిన మల్లారెడ్డి శ్రేణులతో కలిసి నృత్యాలు చేశారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు డప్పు వాయించగా జెడ్పిటిసిలు నాగేశ్వరరావు, అజయ్ నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, జెడ్పి వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, కళాశాల ప్రిన్సిపాల్ నాగార్జున చారి, జెడ్పిటిసిలు సంతోష్, కోవ అరుణ, ఎంపిపి మల్లికార్జున్, పిఎసిఎస్ చైర్మన్ అలిబిన్ అహ్మద్, ఎంపిటిసి మల్లేష్, జిల్లా వైద్యాధికారి తుకారాం, ఆస్పత్రి సూపరింటెండెంట్ చెన్నకేశవులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన విద్య సంస్థల్లో మెరుగైన విద్యా బోధన అందించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గిరిజన రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టోర్ రూమ్‌లో సరుకుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజన వివరాలను సిబ్బందిని, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాజరు, ఉత్తీర్ణత శాతం, విద్యా అందిస్తున్న వసతులను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజన విద్య సంస్థల్లో మెరుగైన విద్యా బోధన అందించాలని సూచించారు. ఉత్తీర్ణత శాతం పెంచేలా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు ఐటీడీఏ ద్వారా ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాఠశాలలు, వసతి గృహాల ప్రాంగణాల పరిసరాలను ప్రతి రోజు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం ఆసిఫాబాద్ హెచ్ఎన్‌టిసి గ్రౌండ్, జీసిసి గోదాం, కాగజ్‌నగర్ ఈఎంఆర్సీను సందర్శించి అధికారులకు పిఓ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిటిడిఓ రమాదేవి, కళాశాల ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల పోరాటం అభినందనీయం

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి.శాంతికుమారి



కాగజ్‌నగర్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తమ సమస్యల పరిష్కారం కోసం గత ఐదు రోజులుగా అంగన్‌వాడీలు చేస్తున్న పోరాటం అభినందనీయమని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి అన్నారు. కాగజ్‌నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని ఆమె శుక్రవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు కేవలం తమ కేంద్రాలకే పరిమితం కాకుండా ప్రభుత్వం నిర్వహించే పలు కార్యక్రమాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి అంగన్‌వాడీ కేంద్రాలే మూలాలనే విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలని సూచించారు. బతుకుతెరువు కోసం పోరాటం చేస్తున్న అంగన్‌వాడీలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద రూ. లక్ష, చనిపోతే రూ. 20 వేలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించి చేతులు దులుపుకోవడం సరైంది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

రెబ్బెన : సమస్యలు పరిష్కరించడంతో పాటు రెగ్యులర్‌చేయాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారం 5వ రోజుకు చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తు నినాదాలు చేస్తు నినాదాలు చేశారు. ఐదు రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా వీరి సమ్మె కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.ఓదెలు మద్దతు తెలిపి మాట్లాడుతూ అంగన్‌వాడలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్‌లుగా గుర్తించి కనీస సదుపాయాలు కల్పించాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని, ఉద్యోగ విరమణ వయసు 60 సంవత్సరాలకు పెంచాలని, ప్రభుత్వం పట్టించుకోకుండా కవ్వింపు చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. సమ్మె కారణంగా చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదన్నారు. అయిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. చిన్నారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోని వెంటనే జేఏసీ సంఘాలతో చర్యలు జరిపి సమ్మె విరమణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి రాజేశ్వరీ, ప్రమీళ, బాలమ్మ, శ్యామల, సంధ్య, మాలతి పాల్గొన్నారు.

దహెగాం : సమస్యల పరిష్కరంలో ప్రభుత్వ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా అంగన్‌వాడీలు ఐదవ రోజు సమ్మెలో ఒంటికాలిపై నిల్చోని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా నాయకురాలు విజ్రమ్మ మాట్లాడుతూ గత ఐదు రోజులుగా వివిధ రకాలుగా నిరసన తెలుపుతున్న ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సిబ్బందిని ప్రక్కనపెట్టి పంచాయతీ కార్యదర్శులతో అంగన్‌వాడీ సెంటర్లను తెరిపించడం సరికాదన్నారు. గ్రామ పంచాయతీ విధులను నిర్వర్తించడమే వారికి పని భారంగా ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆదేశానుసారం అంగన్‌వాడీ సెంటర్లను తెరిచారన్నారు. పర్యవేక్షణ లేకపోవడంతో కేంద్రాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని విమర్శించారు. సమ్మె నోటీసులో పేర్కొన్న విధంగా తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జయ, పద్మ, గౌసియా, రూప, ఈశ్వరి, విజయలక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.



దహెగాం

ఆసిఫాబాద్ : అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రానికి వచ్చిన మంత్రి మల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కనీస వేతనం 26,000 ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. ఈ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ త్రివేణి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, అంగన్వాడి ఉద్యోగులు వనిత, అంజలి, సరోజిని, కల్పనజ సంగీత పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పీపీఆర్‌కు ఘన నివాళులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తంరావు 24వ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం కాగజ్‌నగర్‌లో ఘన నివాళులు అర్పించారు. పురుషోత్తంరావు నివాసంలో ఆయన సతీమణి, మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మీ, తనయుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం స్థానిక ప్రజా కార్యాలయంతో పాటు నౌగాంబస్తీలో ఉన్న పురుషోత్తంరావు విగ్రహం వద్ద నాయకులు, అభిమానులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, నాయకులు కొంగ సత్యనారాయణ, గోలెం వెంకటేష్, దోని శ్రీశైలం, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, సిందం శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్, వీరభద్రచారి, లెండుగురె శ్యాంరావు, పిర్సింగుల తిరుపతి, సత్తిబాబు, మాచర్ల శ్రీనివాస్, శ్రీనివాస్, రమేష్, కొప్పుల శంకర్ పాల్గొన్నారు.

మంత్రికి ఎస్ఎస్ఏ ఉద్యోగుల వినతి

నవతెలంగాణ- ఆసిఫాబాద్

మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి శుక్రవారం జిల్లా కేంద్రానికి విచ్చేసిన మంత్రి మల్లారెడ్డికి ఏస్ఎస్ఏ ఉద్యోగులు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి రెగ్యులర్ చేయాలని కోరారు. ముఖ్యమంత్రి దృష్టికి సమస్య తీసుకువెళ్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా కోశాధికారి నగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్ కుమార్, పిటిఐ అధ్యక్షుడు సత్యనారాయణ, రమేష్, రాజేష్, సతీష్, కేజీబీవీ సీఆర్‌టీలు సురేఖ రాథోడ్, నాన్ టీచింగ్ సిబ్బంది భవాని, తిరుమల, మమత పాల్గొన్నారు

గణేష్ మండపాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

గణేష్ మండపాల వివరాలను నిర్వాహకులు పోలీసు శాఖ రూపొందించిన పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాల నిర్వాహకులు గణేష్ విగ్రహాలను వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేయడానికి ముందస్తు సమాచారం పోలీసుస్టేషన్‌లో ఇవ్వాలని, అందుకోసం కంప్యూటర్, మొబైల్ ద్వారా అప్లై చేసుకోవాలని తెలిపారు. సందేహాలున్నా డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ 8712670557కు సమాచారం అందించాలని సూచించారు.

జిల్లా కేంద్రంలో ఘనంగా ఇంజినీర్స్ డే



నవతెలంగాణ- ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఇంజనీర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ వాసుదేవ్‌ను విద్యుత్‌శాఖ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీర్స్‌కు ప్రాధాన్యత తీసుకువచ్చిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య అడుగుజాడల్లో ప్రతి ఇంజనీర్ నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ శ్రీనివాస్, సిబ్బంది లక్ష్మి నారాయణ, శ్రావణ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

నీతి అయోగ్ ద్వారా మౌలిక వసతుల కల్పన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నీతి అయోగ్ ద్వారా జిల్లాలో ఎంపిక చేయబడిన మండలాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని కేంద్ర ఆర్థిక వ్యవహారాల సంయుక్త కార్యదర్శి కె.మాణిక్‌రాజ్ అన్నారు. నీతి అయోగ్‌లో భాగంగా జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనపై శుక్రవారం కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వైద్య, విద్యా, వ్యవసాయ రంగాలతో పాటు సాగునీటి వసతి, ఉపాధి కల్పన, మౌలిక వసతుల కల్పనపై అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. గర్భిణులకు వైద్య పరీక్షలు సరైన సమయంలో నిర్వహించి వారికి అవసరమైన పోషకాలు అందించే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యతనిస్తూ అంగన్వాడీల ద్వారా గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం అందించాలని తెలిపారు. విద్యారంగంలో ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని, ఈ క్రమంలో పాఠశాలలలో వసతులు కల్పించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా నాణ్యమైన విద్యాబోధన జరిగే విధంగా కృషి చేయాలని తెలిపారు. వ్యవసాయ రంగంలో అధిక దిగుబడులను సాధించే విధంగా సంబంధిత శాఖల అధికారులు ప్రణాళికలు రూపొందించుకొని వ్యవసాయ సాగుకు అవసరమైన సాగునీటి వసతి కల్పించి రైతులకు పంటల సాగుపై మెళకువలు అందించాలని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీపై అర్హులైన కూలీలకు కచ్చితంగా 100 రోజుల పని కల్పించాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ మంత్రి మల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ డిగ్రీ ఇతర చదువులు పూర్తి చేసుకుని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు, ప్రభుత్వ స్టడీ సర్కిల్ లేక వేలాది రూపాయలు వెచ్చించి హైదరాబాద్ ఇతర సుదూర ప్రాంతాలకు వెళ్లి కోచింగ్ తీసుకునే పరిస్థితి ఉందన్నారు. నిరుపేదలు ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందే పరిస్థితి లేదని, చొరవ తీసుకుని వెంటనే స్పందించి కామన్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షులు బొట్టుపల్లి ప్రశాంత్, బీసీ సంక్షేమ సంఘం ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు సిరికొండ సాయికృష్ణ పాల్గొన్నారు.

నవతెలంగాణ
మంచిర్యాల
శనివారం | సెప్టెంబర్ 16, 2023 | www.navatelangana.com

ఆరుగురు డీజే నిర్వాహకుల బైండోవర్

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లి వన్ టౌన్ పరిధిలో వివిధ పండుగలకు, పెండ్లిళ్లకు, ఊరేగింపులకు డీజే సౌండ్స్‌ను ఉపయోగిస్తూ శాంతికి భంగం కలిగిస్తూ ధ్వని కాలుష్యానికి కారణమవుతున్న డీజే నిర్వాహకులను తహసీల్దార్ సుధాకర్ ముందు బైండోవర్ చేసినట్టు ఎస్సై శంకరయ్య తెలిపారు. గణేష్ పండుగ సందర్భంగా సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలలో భాగంగా బైండోవర్ చేశామన్నారు. 6 నెలల కాల వ్యవధిలో తిరిగి సౌండ్ పొల్యూషన్ నేరానికి పాల్పడితే బైండోవర్ ఉల్లంఘన నేరం కింద రెండు లక్ష రూపాయల జరిమానా లేదా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. బైండోవర్ చేసిన సర్వర్ హైమద్ బాషా, అనిల్, సాయి, శ్రీనివాస్, గౌస్‌ను పూచీకత్తుపై వదిలి పెట్టినట్లు తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్లకు సన్మానం

నవతెలంగాణ-మందమర్రి



జాతీయ ఇంజనీర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మందమర్రి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్లకు సన్మానించారు. శుక్రవారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు అగుల్ల తిరుమలేష్ నేతృత్వంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మిట్టపల్లి సుమతి, కమిషనర్ రాజులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణం రంగంలో కొత్త పుంతలను తీసుకువచ్చి వారి సేవలను అందిస్తున్నారన్నారు. సమాజంలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఏ కట్టడమైన వారు లేనిదే జరగదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు గౌతమ్, ప్రధాన కార్యదర్శి మధు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ - సిర్పూర్(టి)

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సిర్పూర్(టి)లో చోటు చేసుకుంది. ఎస్సై దీకొండ రమేష్ వివరాల ప్రకారం... గోవింద్‌పూర్ వాడకు చెందిన చోర్ తరుణ్(23) అనే యువకుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గతకొన్ని రోజుల నుండి మద్యానికి బానిసై ఇంటిలో తరుచూ గొడవ పడేవాడు. గురువారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి తన తండ్రితో గొడవ పడ్డాడు. తండ్రి మందలించనందుకు ఇంటి వెనుక వేళ్లి పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన కాగజ్‌నగర్ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకేళ్లారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు ధృవీకరించారు. మృతుడి తండ్రి సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అభయ యాప్, రోడ్డు సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన



నవతెలంగాణ-తాండూర్

ట్రాఫిక్ రూల్స్, అభయ యాప్, రోడ్ సేఫ్టీలపై సిఐ ఆఫీస్ ఆవరణలో శుక్రవారం సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అభయ యాప్ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ముఖ్యంగా మహిళల రక్షణకు, ఆధునిక సాంకేతికను ఉపయోగిస్తూ భద్రత లక్ష్యం అనే నినాదంతో అభయ మొబైల్ అప్లికేషన్ ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ అప్లికేషన్‌ను మహిళలు ప్రయాణికులు, గృహిణులు ఉపయోగించుకోవాలని కోరారు. మహిళలు సురక్షితంగా ప్రయాణించేందుకు ఈ యాప్‌ను రూపొందించటం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భీమిని ఎస్ఐ మహేందర్, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్స్ పాల్గొన్నారు.

చిన్నారులను సన్మానించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-జన్నారం

ఈ నెల 26, 27న దేశ రాజధాని ఢిల్లీలో ఆశ్రి ఎంటర్‌టైన్మెంట్ నాచ్ లే దివానే ఆధ్వర్యంలో జరిగే జాతీయ స్థాయి నృత్య పోటీలకు మండల కేంద్రంలోని నటరాజ కళాక్షేత్రం నుంచి గాజుల సహస్ర గౌడ్, శ్రేణు, సంకర్ష్, వర్శిని, అశ్విత, తన్వికలు ఎంపికయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో చిన్నారులను ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, మంచిర్యాల జిల్లా నృత్య కళ సమాఖ్య అధ్యక్షుడు రాకం సంతోష్, డాన్స్ మాస్టర్ లక్ష్మణ్, సది, రమేష్‌లతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేఖా నాయక్ మాట్లాడుతూ మారుమూల గ్రామం నుంచి ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి నృత్య పోటీలకు ఎంపిక కావడం సంతోషకరమన్నారు. పోటీలకు ఎంపికైన చిన్నారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అన్నే కాంతామని పాల్గొన్నారు

ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతపై అవగాహన



నవతెలంగాణ-వేమనపల్లి

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం నిల్వాయి గ్రామంలో బ్యాంక్ మేనుజర్ శివశంకర్ ఆధ్వర్యంలో ఖాతాదారులకు పలు విషయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు డిజిటల్ లావాదేవీలు ఉపయోగించుకోవాలని, పంట రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు. అలస్యం అయితే అధిక వడ్డీ కట్టాల్సి వస్తుందన్నారు. ఖాతాదారులకు రూపే కార్డు ద్వారా ప్రమాద భీమా రూ. 2 లక్షలు, ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా యోజన పథకంలో 18-50 సంవత్సరాల వారికీ 436 రూపాయలు చెల్లిస్తే భీమా వర్తిస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన వార్షిక చందాలు చెల్లించి భీమా ప్రయోజనాలు పొందాలని కోరారు. అటల్ పెన్షన్ యోజన పథకం, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ గురించి అవగాహన కల్పించారు.

ఆలిండియా బొగ్గు గనుల సమ్మెను విజయవంతం చేయాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య



నవతెలంగాణ-జైపూర్

వచ్చే నెల 5,6,7 తేదీల్లో నిర్వహించనున్న ఆలిండియా బొగ్గు గనుల సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. శ్రీరాంపూర్ ఏరియా పరిధి ఇందారం ఓపన్‌కాస్ట్ గని కార్మికులతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 11వ వేజ్ బోర్డుకు సంబంధించిన 23 నెలల ఏరియర్స్ మొత్తాన్ని యాజమాన్యం రెండు దఫాలుగా చెల్లిస్తామని ప్రకటించనట్లు గుర్తు చేశారు. ఈ ప్రకటనకు వ్యతిరేకంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అన్ని గనులు, డిపార్టుమెంట్లలో వినతి పత్రాలు, జీఎం కార్యాలయాల వద్ద ధర్నాలు, సామూహిక నిరాహార దీక్షలు చేపట్టటడం జరిగిందన్నారు. ఫలితంగా సింగరేణి యాజమాన్యం దిగివచ్చి ఈనెల 21న ఒకే దఫాగా ఏరియర్స్ చెల్లించేందుకు సర్క్యూలర్ జారీ చేసిందన్నారు. ఈ విషయంలో గుర్తింపు సంఘమైన టీబీజీకేఎస్ కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఏఐటీయూసీ దీక్షల ద్వార యాజమాన్యం దిగివస్తే టీబీజీకేఎస్ మాత్రం తమ సంఘం గౌరవ అధ్యక్షురాలు కవిత చొరవ వల్ల జరిగినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అదే విధంగా వేతన ఒప్పందం పట్ల నిసిగ్గుగా వ్యవహరిస్తున్న అధికారుల తీరును వ్యతిరేకించాలని, అధికారుల సంఘం నాయకులు 11వ వేజ్‌బోర్డులో కార్మికులకు మెరుగైన వేజ్‌బోర్డు ఒప్పందం జరగడం వల్ల డీపీఈ మార్గదర్శకాలను పరిగణలోకి తీసుకోకుండా పెంచడం, దాని కారణంగా అధికారుల వేతనాల కంటే కార్మికుల వేతనాలు ఎక్కువగా పెరిగాయి కాబట్టి వేతనాలు నిలిపివేయాలని జబల్‌పూర్ హైకోర్టులో ఫిల్ వేయడం జరిగిందన్నారు. ఈ విషయమై ఐదు జాతీయ కార్మిక సంఘాలు ఈనెల 14న రాంచీలో సమావేశమై వేతనాలు ఒప్పందాన్ని కోర్టు నిలిపివేస్తే అక్టోబర్ 5, 6, 7 తేదీల్లో మూడు రోజులు ఆలిండియా సమ్మె చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అదేవిధంగా అక్టోబర్ 1న అన్ని ఏరియాల్లో జనరల్ మేనేజర్ల కార్యాలయాల ఎదుట ధర్నా చేయాలని నిర్ణయించమన్నారు. ఇంతటితోనే కాకుండా భవిష్యత్తులో కూడా కార్మికులంతా ఐక్యంగా పోరాటాలు చేసి హక్కులను సాధించుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, ఎస్‌కే బాజీ సైదా, బ్రాంచ్ కోశాధికారి నాగభూషణం, పిట్ కార్యదర్శి నవీన్‌రెడ్డి, గునిగంటి నర్సింగ్‌రావు, మైనింగ్ స్టాఫ్ నాయకులు బాలకృష్ణ, తొంగల సత్తయ్య, అరికె రాజయ్య, జుట్టు రాములు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రిజీయన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

- బెల్లంపల్లి ఏసీపీ సదయ్య



నవతెలంగాణ-మందమర్రి

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య సూచించారు. శుక్రవారం ఓ ఫంక్షన్ హాల్‌లో హిందూ ఉత్సవ కమిటీ, గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏసీపీ సదయ్య మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలన్నారు. పర్యావరణానికి హాని కలిగించే విగ్రహాలను కాకుండా మట్టి విగ్రహాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నవరాత్రుల కార్యక్రమాలు, సభ్యుల వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. ప్రమాదాలు జరగకుండా విద్యుత్, అగ్నిమాపక శాఖలు సూచనల మేరకు ముందు జాగ్రత్తలు పాటించాలన్నారు. మండపాల ఏర్పాటు సంబంధిత శాఖల నుండి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, వివాదాస్పద స్థలాల్లో మండపాలను ఏర్పాటు చేయవద్దని సూచించారు. రాత్రి సమయాల్లో మండపాల వద్ద ఇద్దరు ఉండే విధంగా చూడాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జరిగితే పూర్తి బాధ్యత నిర్వాహకులదేనని స్పష్టం చేశారు. ఉదయం 8 నుండి రాత్రి 9 వరకు నిర్ణయించిన సమయంలోనే స్పీకర్లు వినియోగించాలని, ఇతర మతాలను కించపరిచే పాటలు, అసభ్య కరమైన పాటలు వేయకూడదన్నారు. కార్యక్రమంలో మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సై చంద్రకుమార్, మునిసిపాలిటీ కమిషనర్ గద్దె రాజు రెడ్డి, రామకృష్ణాపూర్, కాసిపేట ఎస్సైలు రాజశేఖర్, గంగారాం, గణపతి నవరాత్రి నిర్వాహక సభ్యులు, మత పెద్దలు, పురోహితులు పాల్గొన్నారు.

రెబ్బెన: మండలంలోని గోలేటిలోని అతిథిగృహం వద్ద తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏరియా జీఎం డి.రవిప్రసాద్ మాట్లాడుతూ మట్టి వినాయకుల పర్యావరణానికి ఎలాంటి హాని జరగదన్నారు. అనంతరం పలువురు యువకులకు ఆయన మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇంజనీర్లు మాసన, లక్ష్మణ్ ప్రసాద్, ఎస్ఓటు జీఎం మచ్చగిరి నరేందర్, పాల్గొన్నారు.

వాంకిడి: మండలకేంద్రంలో వినాయక మండపాల కోసం తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని అనుమతి తీసుకోవాలని ఎస్సై సాగర్ సూచించారు. గ్రామ పంచాయతీ, విద్యుత్ శాఖ అనుమతితో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దాని ప్రతులను స్టేషన్‌లో అందిస్తే అనుమతిస్తామన్నారు.

కౌటాల: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ప్రతిష్ఠించే వినాయకులకు అనుమతి తీసుకోవాలని ఎస్సై మధూకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైక్ పరిమిషన్ కోసం మీసేవాలో దరఖాస్తు చేసి డీడీ తీసుకోవాలని, గ్రామ పంచాయతీ, విద్యుత్ శాఖ నుంచి అనుమతి ఉండాలన్నారు. అనుమతి లేకుండా ప్రతిష్టిస్తే మండపాల కమిటీ సభ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుతో తీరనున్న రైతుల కష్టాలు

- సర్పంచుల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గోదావరి రేవులో లిఫ్ట్ ఏర్పాటు చేయడంతో తిమ్మాపూర్, రాంపూర్ గ్రామాల రైతుల కష్టాలు తీరనున్నాయని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్ అన్నారు. శుక్రవారం తిమ్మాపూర్ గ్రామ గోదావరి రేవులో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుకు డీఈల వెంకటేశం, విట్టల్, లిఫ్ట్ ఇరిగేషన్ జేఈలు అనిల్ రమేష్‌లతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. తిమ్మాపూర్, రాంపూర్ గ్రామాలకు సంబంధించిన రెండు వేల ఎకరాలకు రెండు పంటలు పండే అవకాశం ఉందని, త్వరలోనే పనులను ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ సర్పంచ్ జాడి గంగాధర్ మాట్లాడుతూ తిమ్మాపూర్, రాంపూర్ గ్రామాలకు 22వ డిస్టిబూటరీ ద్వారా కడెం ప్రాజెక్టు నీరు సక్రమంగా అందడం లేదని, చివరి ఆయకట్టు వరకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఈ విషయమై పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత దృష్టికి తీసుకేళ్లడంతో స్పందించిన ఆయన లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరడంతో స్థలాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. త్వరలో లిఫ్ట్ ఏర్పాటు చేసి రైతుల పంటలకు నీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సూపర్‌వైజర్ మామిడి శంకర్, వార్డు సభ్యులు జాడి రాజన్న, జాడి వెంకటయ్య, సిందం శ్రీనివాస్, రైతులు పురంశెట్టి రమేష్ పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై పోలీసుల దాడి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలంలోని టోంకిని గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని పట్టుకున్నారు. ఎస్సై దీకొండ రమేష్ వివరాల ప్రకారం... గ్రామంలో పేకాట ఆడుతున్నరనే సమాచారం మేరకు దాడి నిర్వహించారు. ఇందులో పేకాట ఆడుతున్న గ్రామానికి చెందిన ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. ,26,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు. గ్రామంలో పేకాట ఆడిన, ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరిగిన పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

సమ్మక్క సారలమ్మ మహిళా భవన్ పనులు ప్రారంభం

నవతెలంగాణ-మందమర్రి



ఆదిల్‌పేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సమ్మక్క సారలమ్మ మహిళా భవన్ పనులు ప్రారంభించారు. రూ. 18లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న నూతన భవనాన్ని జెడ్పిటిసి వేల్పుల రవి, ఎంపీపీ మంగాగౌడ్ శుక్రవారం పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు ఎండి నసీరుద్దీన్, గ్రామ సర్పంచ్ పున్నం, ఉప సర్పంచ్, పిఏసిఎస్ డైరెక్టర్, వార్డ్ మెంబర్లు, ఐకెపి మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దత్తత గ్రామంలో ప్రజల అవస్థలు



నవతెలంగాణ-తాండూర్

కిష్టంపేట గ్రామ పంచాయతీలో బిజెపి నాయకులు పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే దత్తత తీసుకున్న కిష్టంపేట గ్రామ పంచాయతీలో మౌలిక వసతులు లేకపోవడం శోచనీయమన్నారు. గ్రామ పంచాయతీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు రోడ్ల మీదకి చేరుకొని ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. క్రిమీకీటకాల వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు స్థానిక ప్రజాప్రతినిధులకు, ఎమ్మెల్యేకు పట్టడం లేదని పేర్కొన్నారు. పంచాయతీలో అక్రమ నిర్మాణాల పట్ల సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు సమస్యలు పరిష్కరించకుంటే అందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి పట్టెం విష్ణుకళ్యాణ్, ఉపాధ్యక్షులు కోమాండ్ల శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రదీప్, రేచిని శక్తికేంద్ర ఇంచార్జి భాస్కర్‌గౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు విఘ్నేష్ పాల్గొన్నారు.

నా నిధులన్నీ ఆపారు : రేఖానాయక్



నవతెలంగాణ-జన్నారం

నియోజకవర్గంలో అభివృద్ధి పనుల నిధులన్నీ రాష్ట్ర ప్రభుత్వం ఆపేసిందని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శుక్రవారం జన్నారం, గుల్లగూడెం, చింతగూడ, రోటిగూడ గ్రామాలల్లో ఆమె పర్యటించారు. తొమ్మిది సంవత్సరాలుగా ప్రజాక్షేత్రంలో ఉన్నానని, అయినా ప్రభుత్వం కక్షకట్టి తన నిధులన్నీ ఆపివేసిందన్నారు. నిధుల ఆపితే అభివృద్ధి ఎలా సాధ్యమన్నారు. ప్రతి గ్రామంలో పర్యటించి తాను చేసిన అభివృద్ధిని చెప్పుకొని మళ్లీ ఓట్లు అడుగుతానన్నారు. తప్పనిసరిగా ఎమ్మెల్యే బరిలో ఉంటానని తెలిపారు. ప్రజలు మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. చింతగూడ గ్రామంలో లక్ష్మీదేవి అమ్మవారి ఆలయంలో పెళ్లి చేసుకున్న, నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అన్నే కాంతామని, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ఎంజేపీ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-హాజీపూర్

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో గుడిపేట్ మహాత్మా జ్యోతిబాపూలే విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. గురువారం లక్షెటిపేటలో మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో అండర్ - 18 సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్, ఖేలో ఇండియా ఉమెన్ లీగ్, మెన్ ఉమెన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో హాజీపూర్ ఎంజేపీ విద్యార్థులు ప్రతిభ చాటారు. 10వ తరగతి విద్యార్థి ప్రేమ్ కుమార్, షాటపుట్, డిస్కస్ త్రో విభాగాల్లో ప్రథమ స్థానం, 1500 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. అతని బాటలోనే 9వ తరగతికి చెందిన జే.దీపక్ 3000 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, 10వ తరగతి విద్యార్థి ఎండీ దానిష్ షాటపుట్ లో తృతీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు కొట్టె దేవేందర్‌ను ప్రిన్సిపాల్ సేరు శ్రీధర్ అభినందిచారు.

ఆర్కే-7గనిలో టీబీజీకేఎస్ అలయ్‌బలయ్



నవతెలంగాణ-నస్పూర్

ఆర్కే-7 గనిలో టీబీజీకేఎస్ నాయకులు అలయ్‌బలయ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా వైస్ ప్రెసిడెంట్ సురేందర్‌రెడ్డి హాజరై కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న 10 సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. టీబీజీకేఎస్ నాయకులు సమస్యలు పరిష్కారం కొరకు ఆర్కే 7, ఆర్కే న్యూటెక్ గనుల ఏజెంట్ రాముడు, ఆర్ కే 7 గని మేనేజర్ సాయిప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా వారు సానుకూలంగా స్పందించారు. అనంతరం టీబీజీకేఎస్ నాయకులు సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చేస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా జిఎం చర్చల ప్రతినిధులు లక్ష్మణ్, కుమారస్వామి, బ్రాంచ్ సెక్రటరీలు అశోక్, రమేష్, ఏరియా నాయకులు సదయ్య, ఫిట్ సెక్రటరీ మెండే వెంకటి పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి రేషన్ షాప్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నామని ఆర్ఐ నవీత్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని దీపక్‌నగర్ 16వ వార్డు ఓపెన్ జిమ్ ఎదురుగా ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ రేషన్ బియ్యం నిల్వ ఉంచారనే సమాచారం మేరకు తనిఖీ చేశారు. తనిఖీలో 15 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని మంచిర్యాలకు తరలించారు.

ఘనంగా భవానీ జాతర



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని సరండి గ్రామ పంచాయతీ పరిధిలో గుట్టపై భవానీ జాతరను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతరకు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి సంవత్సరంలాగానే ఈ సంవత్సరం కూడా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సర్పంచ్ దుర్గం కమలాకర్ సౌకర్యాలు కల్పించారు. జాతరలో ఎలాంటి సంఘటనలు జరుగకుండా సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగం బందోబస్తు ఏర్పాటు చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | సెప్టెంబర్ 16, 2023 | www.navatelangana.com

సర్పంచ్‌ను సన్మానించిన దివ్యాంగులు

నవతెలంగాణ-కడెం



మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2023 రాష్ట్ర అవార్డుకు ఎంపిక కావడంతో నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామ సర్పంచ్ బొడ్డు గంగన్నను మండల దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం అధ్యక్షులు గుమ్ముల రామన్న, మండల అధ్యక్షులు నేరెళ్ల నరేష్, ప్రధాన కార్యదర్శి శేఖర్, సహాయ కార్యదర్శి గణేష్, రమేష్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

నవతెలంగాణ-నేరడిగొండ



మండలంలోని కుమారి గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు, నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను శుక్రవారం బోథ్ నియోజవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సంస్థ చైర్మెన్ గంగేశ్వర్ నేరడిగొండ మండల రెడ్ క్రాస్ సంస్థ కోఆర్డినేటర్ కుంట కిరణ్ కుమార్‌రెడ్డి, ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతం రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు పెంట వెంకటరమణ, స్థానిక సర్పంచ్ రాజు యాదవ్, నరేష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ మందుల రమేష్, దేవేందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ భీమన్న, కమలాకర్‌రెడ్డి, అరుణ్‌గౌడ్, శ్రీనివాస్, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

నవతెలంగాణ-తాండూర్



తాండూర్

రెగ్యులర్ చేయాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీలు చేపట్టిన ఐదవ రోజుకు చేరుకుంది. వీరి సమ్మెకు కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు నాతరి స్వామి, డీసీసీ సభ్యులు రొడ్డ శారద, ఎమ్మార్పీస్ నాయకులు మద్దతు తెలిపారు. వారి వెంట జిల్లా ఉపాధ్యక్షులు తొంగల మల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాం, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కటకం సతీష్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్ వర్ధన్, మండల అధ్యక్షుడు బాకం మల్లేష్, దాసరి విజయ, సమ్మిరెడ్డి, బండి లక్ష్మణ్, యదండ్ల బాలు, కన్నెపెల్లి శ్రీనివాస్, చిలుముల వెంకటస్వామి పాల్గొన్నారు. ఇదిలా ఉంటే తాండూరు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ అధికారులు సీజ్ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వాటిని సీజ్‌చేశామని సూపర్‌వైజర్ మమత తెలిపారు. అంగన్‌వాడీలు సమ్మెలో ఉండగా కేంద్రాల సీజ్‌పై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాసిపేట: ప్రభుత్వం అంగన్‌వాడీ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడుతూ పేదలకు పౌష్టికాహారం, ప్రభుత్వ కార్యక్రమాల్లో కీలకంగాఉంటున్న అంగన్‌వాడీలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సమ్యలను త్వరతగతిన పరిష్కరించేల ముఖ్యమంత్రి కేసీఆర్ చొరువ చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజమౌళి, షైక్ షారుఖ్, దుర్గం ప్రవీణ్, శ్రీకాంత్, మక్కల వెంకటేష్, సల్లూరి సమీల్, జాడి మల్లేష్, మారం సురేష్, కమలాకర్ పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు బీఎస్పీ నాయకులు మద్దతు తెలిపారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షులు మొర్లే గణపతి మాట్లాడుతూ వర్షాన్ని లెక్కచేయకుండా హక్కుల కోసం ఉద్యమిస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తాము అధికారంలో రాగానే అంగన్‌వాడీల డిమాండ్లను ముందుగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా జిల్లా కన్వీనర్ సిడాం జ్యోతి, మండల ప్రధాన కార్యదర్శి దుర్గం శంకర్, డీఎస్పీ కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు.

సారంగాపూర్ : క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తు అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె శుక్రవారం ఐదవ రోజుకు చేరింది. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె శిబిరంలో ప్రభుత్వ వైఖరిని ఎండగట్టుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యురాలు వనజ, మండల అధ్యక్షురాలు భాగ్య లక్ష్మీ మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. రూ.10 లక్షలు, మినీ టీచర్లకు రూ.5 లక్షల బెనిఫిట్స్ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రెగ్యులర్ చేసి నెలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని, వేసవి సెలవుల పాఠశాల మాదిరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

తాంసి : గత ఐదు రోజులుగా అంగన్‌వాడీలు శుక్రవారం మండల కేంద్రంలో బతుకమ్మలను తీసుకవచ్చి అడుతూ, పాటలు పడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు చాలిచాలని వేతనాలతో కుటుంబాలు పోషించుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం ఏ పని చెప్పిన అన్ని పనులు చేస్తున్న మమ్ములను రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూడటం తగదని అన్నారు. ఓటరు నమోదు జనాభ సర్వే వంటి అనేక పనులు చేయడం జరుగుతుందని అన్నారు. సీఎం కేసీఆర్ తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లింగాల చిన్నన్న, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.



కాసిపేట



సారంగాపూర్

ఉపాధి కల్పించే స్టార్టప్ ఏర్పాటు ముఖ్యం



నవతెలంగాణ-బాసర

ఉపాధి కల్పించే స్టార్టప్ ఏర్పాటు ఎంతో ముఖ్యమని ఆర్జీయూకేటి యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన వ్యవస్థాపక సంస్థ స్టార్టప్ కార్యక్రమాన్ని యువ చైర్మెన్ కాకతీయ శాండ్ బాక్స్ రాజారెడ్డితో కలిసి ప్రారంభించారు. వీసీ వెంకటరమణ మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్యార్థుల కోసం వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రఫీ మూడు నెలల నాన్ క్రెడిట్ కోర్సును ఏర్పాటు చేస్తామని తెలిపారు. కాకతీయ శాండ్ బాక్స్ చైర్మెన్ రాజారెడ్డి మాట్లాడుతూ ఔత్సాహిక వ్యాపారవేత్తలకు అద్భుతమైన స్టార్టప్‌తో ముందుకు వచ్చి స్వయం ఉపాధి ప్రయోజనాలు స్టార్టప్‌ను ప్రారంభించే ప్రయత్నాన్ని ఎంతో విలువైనదిగా తెలిపారు. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉన్నట్లుగా ప్రతి పనికి ఒక నూతన ఆవిష్కరణలు చేయడానికి సాంకేతిక విద్యార్థులు పనిని ఉత్తమంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఇన్నోవేషన్ కోఆర్డినేటర్ రాకేష్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తపాలా పొదుపు పథకలపై అవగాహన



నవతెలంగాణ-లక్ష్మణచాంద

తపాలాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో పొదుపు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ పోస్టల్‌శాఖ వారి సేవలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ముత్యంరెడ్డి సూచించారు. సురక్షిత పెట్టుబడులు, సంస్థ అందిస్తున్న పథకల గురించి సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో ఐపీఓ షఫీవుద్దీన్, సర్పంచ్ ముత్యంరెడ్డి, బీపీఎం మాధవకృష్ణ, రిలయన్స్ డీపీఓ లక్ష్మణ్, రిలయన్స్ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ రోహిదాస్, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీలోకి పలువురి చేరిక

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ రూరల్ మండలం కౌట్ల(కె), సోన్ మండలం పాక్‌పట్ల గ్రామానికి చెందిన ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు పలువురు శుక్రవారం బీజేపీ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నివాసంలో ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ పాలనలో ప్రజల బతుకులు బారంగా మారాయని, గడిచిన 9 సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వం స్కీమ్‌ల ముసుగులో భారీ స్కామ్‌లు చేశారని ఆరోపించారు. ప్రజలకు చేసిన అభివృద్ధి ఏంటని ప్రశ్నించారు. యువతకు ఉద్యోగాల కల్పనలో మోసం, రైతులను సైతం మోసం చేశారని అన్నారు. రాబోయే బీజేపీ ప్రభుత్వంలో యువతకు ఉద్యోగాల కల్పన కోసం, ఉద్యోగాలు లేని యువతకు ప్రభుత్వం తరపున సొంత వ్యాపారం చేసుకునేందుకు ఆర్థిక సాయం అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రావుల రాంనాథ్, వొడిసెల అర్జున్, గంగారెడ్డి, భూపతిరెడ్డి, జమాల్, దర్మన్న, అల్లం భాస్కర్, నరేష్, మార గంగారెడ్డి, నర్సారెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని 33/11 కేవీ కైలాస్‌నగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిర్వహన నిమిత్తం 16న శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11గంటల వరకు ఓల్డ్ హౌసింగ్ బోర్డు, శాంతినగర్, ఏరోడ్రమ్, పాలిటెక్నిక్ ఫీడర్స్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఫీడర్స్ పరిధిలోని కాలనీల వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-సారంగాపూర్

మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సరోజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ అట్లా మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం ప్రారంభమవుతుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

పోచమ్మ ఆలయ దుకాణ సముదాయాల వేలం



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి శ్రీ మహా పోచమ్మ ఆలయం వద్ద శుక్రవారం వివిధ దుకాణ సముదాయాల బహిరంగ వేలం నిర్వహించారు. తైబజార్ వసూలు చేసుకొనుటకు వేలం పాటలో రూ.4లక్షల 8వేలకు పి.గంగాధర్ దక్కించు కోగా మిగితా సముదాయలకు సరైన ఆదాయం రానందున వాయిదా వేసినట్లు ఆలయ ఈఓ రంగు రవికిషన్‌గౌడ్ తెలిపారు. ఈ వేలం పాటకు అదిలాబాద్ జిల్లా డివిజన్ దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి రాజమోగిలి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారస్తులు, ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు డైరెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-బోథ్

నూతన మండలంగా ఏర్పాటైన సోనాలలో ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ఎంపీపీ తుల శ్రీనివాస్ కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. పాలన సౌలభ్యం కోసం మండలంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఇక్కడ కార్యాలయాలు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ త్వరలోనే ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మెడికల్, ఐటీ హబ్‌గా తెలంగాణ

నవతెలంగాణ-హాజీపూర్

దేశానికి మెడికల్, ఐటీ హబ్‌గా తెలంగాణ నిలిచిందని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. ఆసిఫాబాద్‌లో మెడికల్ కాలేజ్ ప్రారంభానికి వెళ్తున్న ఆయన మంచిర్యాలలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం అల్పాహారం తీసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సమాఖ్య రాష్ట్రంలో 3, 4 ఉన్న మెడికల్ కాలేజీలను, సీఎం కేసీఆర్ జిల్లాకు ఒకటి ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం 29 ప్రారంభమయ్యాయని, త్వరలో మిగితావి ప్రారంభం కానున్నాయని తెలిపారు. వైద్యుల కొరతను తీర్చాడానికే మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొఅన్నరు. ప్రస్తుతం తెలంగాణాలోనే 9లక్షల మంది ఐటీ ఉద్యోగులు ఉన్నారని, మెడికల్, ఐటీ రంగాల్లో తెలంగాణను నంబర్ వన్‌గా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు.

పునరావాస పనులు త్వరగా పూర్తి చేయాలి



నవతెలంగాణ - కాసిపేట

పెద్దనపల్లి శివారులో దుబ్బగూడెం నిర్వాసితుల కోసం కేటాయించిన ఆర్‌అండ్‌ఆర్ పునరావాస పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సింగరేణి ఏజీఎం నాగరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పునరావాస కాలనీలో జరుగుతున్న పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. వెంటనే పూర్తిగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు శ్రీనివాసులు, నరసింహారాజు, కుమారస్వామి, ఉజ్వల్ బందోపాధ్యాయ, రవి పాల్గొన్నారు.

జీఎంను కలిసిన సినీ దర్శకుడు నారాయణమూర్తి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డిని సినీ నటుడు, దర్శకుడు, రచయిత, నిర్మాత నారాయణమూర్తి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ నారాయణమూర్తి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం జనరల్ మేనేజర్ మాట్లాడుతూ నారాయణమూర్తి నటించిన, చిత్రీకరించిన, దర్శకత్వం వహించిన సినిమాలు తెలంగాణ సాంస్కృతికళ్ళ కట్టినట్టు చూపెడతాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేలిరెడ్డి సురేందర్ రెడ్డి, ఎస్ఓ టూ జీఎం కె రఘు కుమార్, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, డీజీఎంలు పి.అరవింద రావు, చిరంజీవులు, ఆర్కే 5, 6 గ్రూప్ గనుల ఏజెంట్ ఏవీ రెడ్డి, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర రెడ్డి, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు రవీందర్ రెడ్డి, ఎస్టేట్స్ ఆఫీసర్ స్వప్న పాల్గొన్నారు.

ఘనంగా బొడగ పండుగ

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని అచ్చాలపూర్(కొమ్ము గూడెం), తాండూర్, కాసిపేట, కిష్టంపేట, బోయపల్లి గ్రామాలో బొడగ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. పొలాల అమావాస్య రోజు ఎడ్లను పూజించి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. రెండవ రోజు బడగ సందర్భంగా వివిధ గ్రామాల్లో ఆనందోత్సాహాల మధ్య పండగను జరుపుకున్నారు. తాండూర్‌లో నేతకాని కులస్తుల భారీ ర్యాలీ తీశారు.

నార్నూర్ : మండలంలోని మాన్కాపూర్ గ్రామంతో పాటు తదితర ఆదివాసీ గ్రామాల్లో ఆదివాసులు శుక్రవారం బొడగా పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయాన్నే అటవీ ప్రాంతంలోని పొలిమేరలో పిండివంటలతో చేసిన నైవేద్యాలను అర్పించారు. పాడిపంటలు బాగా పండాలని సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాన్కాపూర్ గ్రామ పటేల్ మెస్రం రూపదేవ్, మార్కెట్ కమిటీ వెస్ చైర్మెన్ తొడసం నాగోరావ్, మెస్రం సీతారాం, మెస్రం శేఖర్, భీంరావ్, మోతిరాం, సోము, యాదవ్ రావ్, పవన్ కుమార్, భీంరావ్, జంగు, శేఖర్, జల్పత్ ఉన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ, ప్రయివేట్ ఐటీఐ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు నాలుగో విడత వాక్ ఇన్ ద్వారా అడ్మిషన్లకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆదిలాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20లోపు సీటు పొందని, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ధ్రువపత్రాలతో ఈనెల 20నుంచి 23 వరకు కళాశాలలో సంప్రదించి అడ్మిషన్లు పొందాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఆసక్తి గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ కళాశాలలో వివిధ ట్రెడ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

అంబేద్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణకు ఆహ్వానం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని సెప్టెంబర్ 17 ఆదివారం చించోలి (బి) గ్రామంలో ఘనంగా ఆవిష్కరించనున్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ యువజన సంఘం నాయకులకు శుక్రవారం చించోలి(బి) యువజన సంఘం నాయకులు సాయన్న, ముత్యం విగ్రహ ఆవిష్కరణ ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా మండల బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సప్పల రవి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని నిర్మించి భావిభారత పౌరుల భవిష్యత్తుకు దిక్సూచిగా నిలిచిన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సప్పల సుధాకర్, కప్పకంటి మోహన్, కదంబ మల్లయ్య, కాల్వ నడ్పి ముత్యం, బొల్ల గంగన్న, ముత్యం పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన వైకుంఠపూర్ సర్పంచ్



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని వైకుంఠపూర్ గ్రామ ఇన్‌చార్జీ సర్పంచ్ చిన్నయ్య తన అనుచరులతో శుక్రవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సారంగాపూర్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మాధవ్‌రావు, అడెల్లి ఆలయ చైర్మెన్ అయిటి చందు, ఏఎంసీ చైర్‌పర్సన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, మాజీ చైర్మెన్ రాజ్ మహమ్మద్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు శాంతి కమిటీ సమావేశం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించడానికై నేడు మండలం ఏ స్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు స్థానిక రైతు వేదికలో వినాయక శాంతి కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు శుక్రవారం ఏ స్సై శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మండలంలోని గణేష్ మండపాల నిర్వాహకులు హాజరై గణేష్ మండపాల వివరాలు పోలీస్ శాఖకు అందించి, తగు సూచనలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎవరైనా హాజరు కాకుండా ఉండి, ఏదైనా సంఘటనలు జరిగితే దానికి మండపం నిర్వాహకులే బాద్యులవుతారని తెలిపారు. సకాలంలో హాజరై సహకరించాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో బీజేపీ మండల ఉపాధ్యక్షులుగా లక్కాకుల భూపతి, కాల్వ రవి, మండల ప్రధాన కార్యదర్శి బింగి వెంకటేశ్‌ను ఆయన నియమించారు. వారిని ఆయన శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాథోడ్ రమేష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపుకు పార్టీ నాయకులు కృషి చేయాలని, మోడీ ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, మండల అధ్యక్షులు కొలిపాక రాజశేఖర్, నాయకులు రాజలింగు, రామచందర్, లింగాగౌడ్, దేవిదాస్, బొడ్డు కిరణ్ మండల నాయకులు ఉన్నారు.

పర్యావరణహిత గణపతిని పూజిద్దాం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

పర్యావరణ హిత గణపతిని పూజిద్దామని ఎంపీపీ అడ్వాల పద్మరమేష్ అన్నారు. శుక్రవారం వెలుగు కిరణం మండల సమాఖ్య కార్యాలయంలో పర్యావరణ హిత గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. ప్రతీ ఇంట్లో పర్యావరణ హిత గణపతిని పూజిద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వాణిశ్రీ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, మండల వెలుగు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

గణేష్ మండపాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గణేష్ మండపం నిర్వాహకులు గణేష్ మండపాలను ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుశాఖ వారు రూపొందించిన గణేష్ మండపం నిర్వహణకు సంబంధించిన ఆన్‌లైన్ ఇన్ఫర్మేషన్ అనేది కేవలం మండపం నిర్వహణ, నిమజ్జనం తేదీ, సమయం, ప్రయాణించే దారి, ప్రదేశం, నిర్వాహకుల వివరాలు, వాలంటీర్ల వివరాలు, మండపానికి సంబంధించిన సమాచారం కొరకు మాత్రమే రూపొందించిందని అన్నారు. గణేష్ ఉత్సవాల నిర్వాహకులు గణేష్ విగ్రహాలను వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేయుటకు ముందస్తు సమాచారం పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వడం అందుకోసం ఏదైనా కంప్యూటర్, మొబైల్‌లో వివరాలను సమర్పించాలని అన్నారు. అందుకొరకు పోలీస్‌పోర్టల్.టీఎస్‌పోలీస్.గావ్.ఇన్ అనే వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరచి అప్లికేషన్‌ను సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో అందించాలని సూచించారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే ఎలాంటి రూమర్స్, వదంతులను నమ్మకూడదని ఎవ్వరికైన ఎలాంటి సందేహాలు ఉన్న దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ గాని పోలీసు వారికి లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. ఈ పండుగను గణేష్ నిమజ్జన ఉత్సవాలను అందరు ఆనందోత్సవాల మధ్య శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు.